క్లుప్తంగా

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు


తులసిమాల అలంకరణలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని చింతలూరు, నర్సిపూడి, గుమ్మిలేరు, సంధిపూడి గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామ స్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి, పూలమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు.

గుర్రపుడెక్క తొలగింపు

ఆలమూరు: ఆలమూరు నుంచి వెదురుమూడి వెళ్లే పంటకాలువలో సాగునీరు పారుదలకు ఇబ్బంది కలిగిస్తున్న గుర్రపుడెక్క తొలగింపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కాలువ వెంబడి కొంతమంది వ్యర్థాలు, చెత్త చెదారం నింపడం వల్ల సాగునీరు వేగంగా వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతుంది. దీనికి తోడు గుర్రపుడెక్క అధికంగా ఉండటాన్ని గమనించిన ఇరిగేషన్ శాఖ ఆదిశగా చర్యలు చేపట్టింది. ఈ పనులు పూర్తయితే శివారు ప్రాంతానికి సైతం సాగునీరు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుందని జేఈ కృష్ణ త్రిమూర్తులు తెలిపారు.

చిన్నారికి ఆర్థిక సాయం


అలెక్స్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలేనికి చెందిన చిన్నారి ఇంజేటి అలెక్స్‌కు కంటి చూపు వైద్యం నిమిత్తం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేలు ఆర్థిక సాయం శనివారం చేశారు. కువైట్ కేంద్రంగా ఉన్న హెల్పింగ్ ద నీడ్ ఎన్నారై ఫౌండేషన్ ద్వారా పై మొత్తం సమకూర్చారు. స్థానిక సదరు ఫౌండేషన్ సభ్యులు ఇచ్చిన ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా చిన్నారికి అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తికి ఆర్థిక సాయం

స్థానిక ఆబోతు గుడికి సమీపాన అనారోగ్యంతో ఉన్న నక్కా వినోద్ కుమార్‌కు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.12,500 ఆర్థిక సాయం శనివారం పంపిణీ చేశారు. కువైట్ కేంద్రంగా ఉన్న గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హేండ్స్ ఫౌండేషన్ స్థానిక ప్రతినిధి నక్కా జోసఫ్ బుజ్జి, తమ కుమార్తె అభినయ పుట్టినరోజు పురస్కరించుకుని పై మొత్తాన్ని సమకూర్చారు. దీనిని బాధితుడి తండ్రికి ఎమ్మెల్యే అందజేశారు.

సంపూర్ణ పోషణతో సమస్యలు దూరం

అంబాజీపేట: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలకు సమస్యలు దూరం అవుతాయని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీఎస్‌వీ మహాలక్ష్మి అధ్యక్షతన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పౌష్టికాహార లోపంతో ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 9 మంది గర్భిణులకు సీమంతం చేశారు.

ఎస్సైను కలసిన సర్పంచ్‌లు

మామిడికుదురు: నగరం ఎస్సైగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.సురేష్‌ను మండల సర్పంచ్‌ల సమాఖ్య ప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మామిడికుదురులోని నగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైను కలసి పూలమాలలు వేసి, బొకేలు అందించి శుభాభినందనలు తెలియజేశారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, బళ్ల శ్రీనివాసరావు, మద్దాల బాబూరావు, గుబ్బల దుర్గ, అల్లు విజయలక్ష్మి ఎస్సైను కలసి అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా వార్డు ఉపఎన్నికలు


ఊబలంకలో అధికారుల నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొవ్వూరి సాయిలక్ష్మి

రావులపాలెం: మండలంలోని ఊబలంక మూడో వార్డులో వైఎస్సార్ సీపీ మద్దతుదారు కొవ్వూరి రామిరెడ్డి మృతితో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడంలో భాగంగా నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు, రామిరెడ్డి భార్య కొవ్వూరి సాయిలక్ష్మి 123 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు స్టేజ్ 2 ఎన్నిక అధికారి పీఆర్‌సీ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం నిర్వహించిన పోలింగ్‌లో ఈ వార్డులో 490 ఓట్లకుగాను 415 ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. కౌంటింగ్ అనంతరం వెలువడిన ఫలితాల్లో కొవ్వూరి సాయిలక్ష్మికి 266 ఓట్లు, సమీప అభ్యర్థి పడాల రంగారెడ్డికి 143 ఓట్లు వచ్చాయి. దీంతో 123 ఓట్ల మెజార్టీతో సాయిలక్ష్మి గెలుపొందినట్టు ఎన్నికల అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

మాచవరంలో..

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు ఉపఎన్నికకు సంబంధించి శనివారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక మెట్లకాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను, కౌంటింగ్ హాల్‌ను కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. వార్డులో 734 ఓట్లుకు గాను 50 శాతం 366 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బి.మంగాదేవి, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు తెలిపారు. పెచ్చెట్టి బాలవేణికి 162 ఓట్లు, మట్టపర్తి వెంకటేశ్వరరావుకు 197 ఓట్లు, చెల్లనివి 6, నోట ఒక ఓటు వచ్చిందన్నారు. వెంకటేశ్వరరావు 35 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ డి.ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ బందోబస్తు నిర్వహించారు.

ర్యాలిలో..

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామ పంచాయతీ ఒకటో వార్డు సభ్యుడి ఎన్నికకు జరిగిన ఉప ఎన్నికల్లో గౌను గుర్తు తరపున పోటీ చేసిన తుటారపు బాలసుబ్రహ్మణ్యం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె..సూర్యనారాయణ తెలిపారు. 666 ఓట్లకు గాను 486 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో గౌను గుర్తు తరపున తుటారపు బాల సుబ్రహ్మణ్యంకు 305 ఓట్లు రాగా పి.కిషోర్‌వర్మ (ప్రెషర్ కుక్కర్)కు 180 ఓట్లు లభించాయి. ఒక ఓటు చెల్లని ఓటు వచ్చింది. సహాయ ఎన్నికల అధికారి కె.కృష్ణమాచార్యులు, ఈఓపీఆర్డీ చంద్రశేఖర్, పోలింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది, ఎన్నికల ఏజెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్న సీఎం


జి.పెదపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేద వర్గాల అభ్యున్నతితో పాటు, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం జి.పెదపూడిలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ దంగేటి అన్నవరం, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు, నాయకులు కత్తుల విక్టర్‌బాబు, మానుకొండ నిర్మల తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగారు. జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరిస్తూ పత్రాలను అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేక చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా కలసి అనేక కుట్రలు పన్నుతున్నారని అన్నారు. నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, నాయకులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, ఈలి చంద్రరావు, పండు, తోలేటి బంగారునాయుడు, కేతా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

అంబాజీపేట: ముక్కామలలో ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ రీసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు, పనిముట్లను అందిస్తున్నారని వివరించారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ పంట


గోగన్నమఠంలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమాల పంట పండిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. గోగన్నమఠంలో పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మూడు, నాలుగు సంక్షేమ పథకాలు అందాయన్నారు. జగన్ పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను విస్మరించడం, ప్రజల్ని మోసం చేయడం టీడీపీకే చెల్లాయన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జగన్ ఎక్కడా సంక్షేమాన్ని వీడలేదన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలిచి సంక్షేమ పథకాలను మరింత విస్తరించే దిశగా సహకారం అందించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఆర్‌వీఎస్‌ఎస్ నర్సింహవర్మ, కటకంశెట్టి ఆదిత్యకుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు సాగి సత్యనారాయణరాజు, పార్టీ నేతలు రాపాక వెంకట్‌రామ్, సూరిశెట్టి బాబి, కంచర్ల శేఖర్, ఎండీవై షరీఫ్, ముత్యాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమాపై గృహసారథులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గృహసారథుల బీమా పథకం పెట్టి వారి కుటుంబాలకు రక్షణ కల్పించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం తొత్తరమూడి సచివాలయం -1లో తొత్తరమూడి సచివాలయం-1, తొత్తరమూడి సచివాలయం-2కు చెందిన గృహసారథులు బీమా నమోదు శిక్షణలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండేటి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ లబ్ధి చేకూరుస్తారన్నారు. ఆయన చెప్పిన మాట చెప్పినట్లు చేయడంలో వెనుకడుగు వేయరన్నారు. గృహ సారథులకు బీమా కల్పించి వారి కుటుంబానికి రక్షణ నిలుస్తున్నారన్నారు. ఇంకా అనేక ప్రయోజనాలు అందిస్తారన్నారు. తొలుత ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వార జయసావిత్రి, ఎంపీటీసీ రమణాతి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, గృహసారథులు కన్వీనర్ పులిదిండి ప్రభాకర్, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పాఠశాలే లక్ష్యం కావాలి

కొత్తపేట: ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉత్తమ పాఠశాల లక్ష్యంగా, గురువు-విద్యార్థి భావనతో ఉపాధ్యాయులు ముందుకు వెళ్లాలని తహసీల్దార్ జీడీ కిషోర్ బాబు అన్నారు. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు పలువురు విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన బయటపడిన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక విద్యాశాఖ ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో ఎం.హరిప్రసాద్ అధ్యక్షతన తహసీల్దార్ కిషోర్‌బాబు మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ఆ వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. మండలంలో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ-2 కె.లీలావతి, జీహెచ్‌ఎంలు అల్లూరి గోపాలరాజు, ఎస్.సత్యనారాయణ, బండారు దుర్గాప్రసాద్, పి.ఇందిరాబాయి, కె.అరుణశ్రీ, వై.చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, భాస్కరశాస్త్రి, వీవీఎస్‌ఆర్ మూర్తి తదితరులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం


కొత్తపేటలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొత్తపేట: అన్ని వర్గాలను, చేతి వృత్తుల వారి మాదిరిగానే ఫొటోగ్రాఫర్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలని సీనియర్ ఫొటోగ్రాఫర్ నామాల వెంకటేశ్వరరావు (శ్రీను) కోరారు. కొత్తపేట ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో జరుపుకున్న కార్యక్రమంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డి.చిన్న, కార్యదర్శి ఎస్.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు జి.పెద్దిరాజు, కోశాధికారి వై.శివ, సభ్యులు నాగు, ప్రసాద్ పాల్గొన్నారు.

అంబాజీపేట: గత స్మృతులు తీపి జ్ఞాపకాలకు ఫొటో ఉత్తమమైనదని అందరికీ అటువంటి మధుర స్మృతులను మిగిల్చిన కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిరస్మరణీయులని ఏఎస్సై భగవన్‌నారాయణ పేర్కొన్నారు. అంబాజీపేట మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో పుల్లేటికుర్రులో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు గంటా వెంకటగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల రూపకర్త డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఫొటోగ్రాఫర్ల జెండాను ఆవిష్కరించారు. వైస్ ప్రెసిడెంట్ అత్తిలి ప్రసాద్, కార్యదర్శి పిల్లి వీరప్రతాప్, ట్రెజరర్ శంకర్, గౌరవ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని శనివారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాగూరే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్స్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే జయంతిని మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడెక్ట్ పార్కులో నిర్వహించారు. డాగూరే విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. డాగూరే సమాజానికి అందించిన సేవలు కొనియాడారు. మండల సంఘ అధ్యక్షుడు పసుపులేటి శివకుమార్, జిల్లా నాయకుడు గూటం శ్రీనివాసరావు, కడలి శ్రీనివాసరావు, షేక్ దొరబాబు, కుడుపూడి రాము, పి.బాలాజీ, గూటం ఉమామహేశ్వరరావు, మేడిశెట్టి మామాజీ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండల కేంద్రమైన ముక్తేశ్వరం సెంటర్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఫొటో వీడియో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిర్ణీత సమయానికి టీకాలు అందించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉపకేంద్రాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున ఆధ్వర్యంలో ఆలమూరు-1, ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటిరేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


పాశర్లపూడిలో లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

మామిడికుదురు: పాశర్లపూడి పెట్రోల్ బంకు సమీపంలో శనివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. రాజోలు వైపు తవుడు లోడుతో వెళ్తున్న లారీ 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ట్రాన్స్‌ఫార్మర్ వైపు దూసుకుపోయింది. హైటెన్షన్ తీగలతో కూడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు రెండు విద్యుత్ స్తంభాలు లారీ స్పీడుకు దెబ్బతిన్నాయి. హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి పడిపోయాయి. చీకటి సమయం కావడంతో పాటు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు పాడైపోయిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించడంతో పాటు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు.

సక్రమ వినియోగంతో వంట గ్యాస్ ఆదా



కొత్తపేటలో గ్యాస్ వినియోగదారులకు బహుమతులు అందజేస్తున్న డీలర్ సతీష్

కొత్తపేట: వంట గ్యాస్‌ను సక్రమంగా వినియోగించడం ద్వారా ఎంతో ఆదా చేసుకోవచ్చని హెచ్‌పీ గ్యాస్ చీఫ్ రీజినల్ మేనేజర్ (సీఆర్‌ఎం) అన్నవరపు సుందరవదన అన్నారు. స్థానిక శ్రీనివాస హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో హెచ్‌పీ గ్యాస్ ఉచిత సేవా శిబిరం నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్ బండారు వీవీఎస్ఎన్ మూర్తి (సతీష్) అధ్యక్షత జరిగిన సభలో సీఆర్‌ఎం సుందరవదన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్యాస్‌ను ఉపయోగించే విధానం, గ్రాస్ ఆదా, ప్రమాద రహిత వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉచిత సేవా శిబిరాన్ని పురస్కరించుకుని కొత్త గ్యాస్ కనెక్షన్, రెండో గ్యాస్ సిలిండర్లను రాయితీపై సరఫరా చేశారు. శిబిరంలో పాల్గొన్న గ్యాస్ వినియోగదారులకు రూ.400 విలువ చేసే స్టీల్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ సెల్స్ ఆఫీసర్ ఎంవీఎస్ఎన్ శ్రీనివాస్, ఏజెన్సీ మేనేజర్ భమిడిపాటి ఆదిత్యభగవాన్, ఏఎండి.మహదేవశర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలి


పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

పి.గన్నవరం: ఓటర్ జాబితాల డోర్ టు డోర్ వెరిఫికేషన్‌ను ఈనెల 21లోపు పారదర్శంగా పూర్తి చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఈ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటర్ల జాబితాల డోర్ టు డోర్ పరిశీలనలో తేడాలు, అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. తహసీల్దార్లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీహెచ్ నాగలక్ష్మి, రియాజ్ హుస్సేన్, పి.మంగతాయారు, ఎంపీడీఓ ఎం.భారతి, డీటీ బి.గోపాలకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కర్బలా అమర వీరులకు నివాళి

మామిడికుదురు: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా శనివారం కర్బలా అమర వీరులకు ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. కర్బలా సంఘటనల అనంతరం జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివారాన్ని బందీలుగా చేసి కూఫా, సిరియాల్లో బహిరంగంగా ఊరేగించిన సంఘటనలను మత ప్రబోధకులు భక్తులకు వివరించారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలోను, ఖమారే బన్నీ హాసిమ్, షహజాదే ఖాసిం పంజాల్లో జరిగిన కార్యక్రమాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శనివారం స్వాగతం పలికారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబా అధ్యక్షతన స్టూడెంట్ ఇంట్రడక్షన్ ప్రోగ్రాం (ఎస్ఐపీ) నిర్వహించారు. పట్టుదలతో డిగ్రీ పూర్తి చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రిన్సిపాల్ సాయిబాబా పిలుపునిచ్చారు. కళాశాలలో గ్రంథాలయం, ల్యాబ్, జేకేసీ సెంటర్ సదుపాయాలతో పాటు నిరంతర శ్రమించే అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్, నల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ సింగం రాధ, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ.87,552 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అన్నదానానికి పలువురు భక్తుల విరాళాల రూపంలో మరో రూ.5,348 ఆదాయం వచ్చినట్టు ఈఓ రాధ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'వేమా'



రాజోలు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ఎన్నికయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి తన నియామకాన్ని ప్రకటించారని శనివారం వేమా తెలిపారు. ప్రస్తుతం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కమిటీలో వేమాకు చోటు దక్కడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేమా జాతీయ, రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శిగా, బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా పని చేశారు.